# అంతరార్ధం

పెళ్ళయి నెలయినా తిరక్కముందే శేఖరం చనిపోయాడనే వార్త పిడుగులాగ వచ్చిపడింది. శేఖరానికీ నాకూ చాలా ఏళ్ళపట్టి స్నేహితం. ఏ ఒక్క విషయంలో నూ మేమిద్దరం ఏకాభిప్రాయంతో లేము. అయినప్పటికీ ఒకరిని చూస్తే, ఒకరికి అమితమైన గౌరవం, ప్రేమ. ఏదో మాయిద్దరికి తెలియని సూత్రం మమ్మల్ని బంధించింది అని అనుకుంటూ వుండేవాళ్ళం. పెళ్ళి శుభలేఖ వచ్చింది. పెళ్ళికి వెళ్ళాను కూడా. తర్వాత మళ్లీ యీవార్తే. ఈలోగా నాకు యేవిధమైన సమాచారము తెలీదు. ఓ నెలరోజుల్లో యింత ముంచుకొచ్చే ప్రమాదం వస్తుందని, నేను కలలో కూడా అనుకోలేదు. హఠాత్తుగా వచ్చిన జబ్బువలన పోయాడని

మాత్రం తెలిసింది. ప్రతినిత్యం మానవుడు చచ్చిపోవడానికే యెక్కువ కారణాలు కనిపిస్తూ వుంటాయి. కాని ఏదోవిధంగా బ్రతుకుతూవుంటాడు.

నాకు యెంతో ఆశ్చర్యం వేస్తూవుంటుంది. నిత్యకృత్యం మృత్యు ముఖంలోంచి తప్పించుకుంటూ, ఎప్పటికప్పుడు ఏమవుతుందో తెలీకండా భయపడిపోతూవుండే మానవజీవితం యొక్క మనుగడ యెంతో ఆశ్చ ర్యాన్ని కలిగిస్తూ వుంటుంది. ఈ దృష్టితో చూస్తే మానవుని చావుకు యేస్వల్పకారణమైనా సరిపోతుంది. అందులో శేఖరానికి యేదో జబ్బు వచ్చిందన్నారు. హఠాత్తుగా నా మనస్సు ఒక్కక్షణం పనిచెయ్యటం మానేసింది. క్రిందటిసారి నేను శేఖరాన్ని చూసింది పెళ్ళికొడుకుగా. వెంటనే నా దృష్టిఅంతా ఆ పెళ్ళి సంరంభంలోకి మరలింది.

* * *

నేను బండి దిగి గుమ్మంలో అడుగు పెట్టగానే యెంతో ఆప్యా యంగా కౌగలించుకుని, నన్ను లోపలికి తీసుకుపోయాడు శేఖరం. అంత నిష్కల్మషమైన ప్రేమ. ఏమేమిటో ప్రశ్నలు వేసు కుంటూ పోయాడు శేఖరం. నేనేమీ సమాధానం చెప్పలేక పోయినాను. ఓ మూల పెళ్ళి సుముహూర్తం సమీపిస్తోంది. అందరూ కూడా హడావిడిగా యెవ్వరి పనుల్లో వారు నిమగ్నులయి పోతున్నారు. నేనుమాత్రం గది దర్వాజాకు ఆనించివేసిన కుర్చీలో కూర్చున్నాను. గది తలుపులు లోపల్నుంచి బిగించి వున్నాయి. గదిలోంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. నేను ఆశ్చ ఆదుర్దా చూపించలేదు. నాకు స్పష్టంగా వినిపించేటంత కంఠంతో మాటలు నడుస్తున్నాయి.

'ఇవ్వాళ పెళ్ళిలో అవుతే, యెవరికీ తెలీకండా దాచేస్తాం. తీరా పెళ్ళయిన తర్వాత శేఖరానికి తెలీకండా వుంటుందా? అప్పుడు వాళ్ళ కాపరం యేరీతిగా పరిణమిస్తుందో! నాకు అదే భయంగా వుంది......

'అందుకనే మనం వెళ్ళి శేఖరానికే సూటిగా చెప్పేస్తే సరిపో తుంది.'

'నూరు అబద్దాలు ఆడి అయినా ఓయిల్లు నిలబెట్టమన్నారు. మనం మాత్రం యీ విషయం బైటకు పొక్కనీకూడదు.'

'ఏమో నాకవుతే భయమేస్తోంది...'

ఏమిటో యిలాంటి మాటలే వినిపించినాయి. అసలు విషయము యేమిటో నాకు యేమీ తెలియలేదు. గదిలోంచి వచ్చిన నలుగురు కూడా నన్ను అనుమానంతో చూశారు. నేను వాళ్ళు అనుకుంటున్న మాటలు విన్నాననీ గుట్టు బైటపడిపోయిందనీ, శేఖరానికి తెలిసిపోతుందనీ, వాళ్ళు అనుకుని వుంటారు. నాకు కొంచెం ఆశ్చర్యం వేసింది. విషయం యేమిటో కనుక్కోవాలనే కుతూహలం హెచ్చిపోయింది. నేను కూడా కొంచెం జాగ్రత్తగానే మెలుగుతూ దాని ఆచూకి తీద్దామని ప్రయత్నం చేశాను. ఆడవాళ్ళ నోట్లో మాట దాగదని నాకుతెలుసు. లేనిపని కల్పించు కుని ఆవైపుకు వెళ్లాను. పెళ్ళికొడుకు స్నేహితుడు అంటే పెళ్ళిలో వరునికంటె గౌరవం. నేను యేదో గుట్టు తెలుసుకుపోదామని వచ్చానని యెవ్వరూ అనుకోలేదు. పైగా కొంతమంది నాకు తెలీకండా వుంటుందా అని కూడా అనుమానపడ్డారు. అందరూ బాహాటంగానే అనుకుంటున్నారు.

ఇంతకీ యేమిటంటే అసలువిషయం, పెళ్ళికూతురు శోభ యెవ రినో ప్రేమించిందని, ఆ యువకునితో చాలా రోజులపట్టి సంబంధం వుందని, వధువు తండ్రి పట్టుపట్టి, ఆ సంబంధాన్ని ససేమిరా కాదని యీ పెళ్ళి చేయిస్తున్నాడని పుకార్లు. వధువు శోభ పతిత. పెళ్ళికొడుకు కళ్ళకు, గంతలుకట్టి, నిజం కప్పిపుచ్చి, వాళ్లను మోసంచేశారని. అట్లాకాదు, వరునివైపువాళ్లకు కూడా యీ విషయం మొదటినుంచీ

తెలుసు. అయినప్పటికీ తెలీనట్లు నటిస్తూ యీ సంబంధానికి వప్పుకున్నా రని ఒక రకపుమాట. గిట్టనివాళ్ళు అనేకం అంటూవుంటారు. వీటన్నింటిని వింటూవుంటే మనం అడుగు ముందుకు వెయ్యలేమని ఒక కార్యవాది అభిప్రాయం.

నేను ఎటూ తేల్చుకో లేకపోయాను. పెళ్లి ముహూర్తం సమీపించింది. ఎవ్వరూ సాహసించి శేఖరం దగ్గరకు వెళ్లిన పాపాన పోలేదు. పెళ్ళి అయిపోయింది. నేను యింటికి బయలుదేరే ముందు, శేఖరం దగ్గరకు వెళ్ళి ఆ విషయం యీ విషయం మాట్లాడుతూ, సంసారం అన్నతర్వాత అనేకరకాల ఒడుదుడుకులు వస్తూ వుంటాయి, వాటన్నిటిని సమన్వయించుకుని పోతూ వుండాలనీ, భార్యాభర్తల మధ్య ఎన్నెన్నో పొరుపులు వస్తూంటాయి వాటన్నిటిని లెక్క పెట్టక అన్యోన్యంగా వుండాలనీ చెప్పాను. ఈ విషయాలు ఆనాడు శేఖరంతో చెప్పటం నాకే ఆశ్చర్యం వేసింది. శేఖరం నావైపు అదోవిధంగా చూశాడు. నా భావం గ్రహించి చూశాడో, లేక యిట్లా యెందుకు చెప్పుతున్నాడో అని ఆశ్చర్యంతో చూశాడో నేను కనుక్కోలేకపోయాను.

బహుశా శేఖరం చావుకు, వధువుయొక్క గత చరిత్రకు యేమన్నా సంబంధం వుందా అని ఒక్కక్షణం ఆలోచించాను. ఇంకా శేఖరాన్ని గురించిన ఆలోచనలు యెన్నెన్నో వస్తున్నాయి. పెద్దనిట్టూర్పు విడిచి మెల్లిగా లేవబోయాను. ఇంతలోనే కిటికి సందుల్లోంచి దారిచేసుకుని ఒక వుత్తరం వచ్చిపడింది. మామూలుగానే వుత్తరం తీసి చదివాను. నాకు ఆ వుత్తరంలోని విషయం అగమ్యగోచరంగా కనిపించింది. ఈ వుత్తరం వ్రాసింది సూరిగాడు. అతి తెలివిగా మాట్లాడినట్లే, అతి తెలివిగా వ్రాస్తూవుంటాడు. దాన్ని అర్థం చేసుకోవాలంటే కొంచెంసేపు ఆలోచిం

చాలసి వుంటుంది. ఈ వుత్తరం మళ్ళీ చదువుతూ వుంటే, మూడు నెలల నాటి సూరిగాడితో సమావేశం వెంటనే జ్ఞాపకం వచ్చింది.

ఊళ్ళ వెంబడి తిరుగుతూ ఆనాడు మా యింటికి వచ్చాడు. అతను వచ్చినట్టుగానే మాయింటికి అనాధ శరణాలయం నుంచి ఒక పెద్దమనిషి వచ్చి చందాకోసం బలవంతపెడుతున్నాడు. తల్లిదండ్రులు లేని పిల్లల కోసం యీ శరణాలయం యేర్పడిందని, వాళ్ళందర్నీ, రక్షించే బాధ్యత మనందరికి వుందని యేమేమిటో చెప్పుకు పోతున్నాడు. సూరి విని విని ఒక్కసారి కస్సుమని లేచాడు. 'ఎవరో ఎక్కడో కనిపోతే,ఆ మూకంతా తీసుకువచ్చి ఓ శరణాలయం పెట్టటమూ, దాని పోషణకోసం మా ప్రాణాలు తియ్యటమూను, నీకు వేరే యేమి పనిలేదూ'అన్నాడు సూరి.

ఆ పెద్దమనిషికి మనస్సు చివుక్కుమన్నది. నన్ను చూసి వూరుకున్నాడు.

'బాబుగారు మీకు యీ విషయాల్లో అనుభవం లేదనుకుంటాను. మీకు యేకొంచెం తెలిసినా తొందరపడి యిట్లా అనరు' ...అన్నాడు అయన యెంతో నిబ్బరంగా.

సూరి అయన్ను కొన్ని ప్రశ్నలు వెయ్యటం మొదలుపెట్టాడు. ఆ సంభాషణలు చాలా పొడుగ్గా సాగినాయి. కన్యా వివాహాలు, విధవా వివాహాలు చర్చకు వచ్చినాయి.

విధవా వివాహాలను గురించి మాట్లాడుతుంటే, సూరికి యెక్కడ లేని కోపం వచ్చింది. ఈ విషయంమీద సూరికి తీవ్రమైన నిశ్చితాభిప్రాయం వుంది.

'ఈ మొగుడు పోయిన—దూకుడుగానే అన్నాడు మాట—వాళ్ళం దర్నీ పెళ్ళిళ్ల చేసుకుంటామని మేమేమీ  కంకణం కట్టుకుని కూర్చో లేదు. కన్యలకు పెళ్ళవటమే కష్టంగా వుంది. మధ్య వీళ్ళ మళ్లీను...'

'మరి వాళ్ళగతేం  కావాలి చెప్పండి. జీవితాంతం వాళ్ల  అలా కుమిలిపోవలసిందేనా...' ఆయన యెంతో జాలిగా అడిగాడు.

లేకపోతే వాళ్ళను కట్టుకుని వూరేగమంటారా.  ఎందుకొచ్చిన మాటలండి. ఈ పతిత మానవుల వుద్ధరణకు మనం పూర్తిగా వ్యతిరేకులం, అసమర్థులం తెలిసిందాండీ! ఇంతటితో మనం యీచర్చ ముగిద్దాం... ఎక్కడో ఎవరినో వుద్ధరిస్తున్నామనుకుని ఆత్మవంచన చేసుకుని ఏ విధవ రాలినో కట్టుకుని, యావజ్జీవం మానసికంగా  బాధపడకండి...'సూరి యింకా యేవేవో అన్నాడు.

కొంచెం ఘర్షణ అయిపోయిన తర్వాత  ఆయన వెళ్ళిపోయాడు.

నేను పిలిచి యేమిటి యీ గొడవంతా అని అడిగాను.

నువ్వేమన్నా అనుకో...యీ విధవల్ని పెళ్లిచేసుకోమనేవాళ్లన్నారే వాళ్లు వట్టి వెధవలని నా నమ్మకం—'అన్నాడు సూరి,

ఆ సాయంత్రానికే అతను వెళ్లిపోయాడు. మళ్ళీ సూరిదగ్గరనుంచి యే కబురు తెలీలేదు. తర్వాత యీ వుత్తరమే వచ్చింది.

'...నాకు యీ మూడు నెలల్లోను యెంతో  అనుభవం అయింది. ఈ అనుభవం దృష్ట్యా నేను నీతో వ్యక్తపరచిన అభిప్రాయాన్ని మార్చుకోవాలసి వచ్చింది. విధవా వివాహాన్ని  గురించి తీవ్రంగా యేమిటో అనేసి, నీదగ్గరకు వచ్చిన పెద్దమనిషిని ఆనాడు దూషించాను. ఈసారి ఆయన్ను కలుసుకోవటం తటస్థిస్తే, క్షమాపణ  కోరుకుంటాను...ఇంతకీ

ముఖ్యంగా నేను వ్రాసేదేమిటంటే విధవా వివాహానికి నేను సుముఖుడ్ని అవటమే కాకుండా, ఒక విధవనే పెళ్ళిచేసుకొనటానికి నిశ్చయించు కున్నాను. ఈ విషయం నీకు ఆశ్చర్యం కలిగించక మానదు-అభిప్రాయం మార్చుకుని, ఆచరణలో పెట్టటమనేది సర్వసాధారణమైన విషయము కాదని నువ్వు గుర్తించకపోవు-మిగతా విషయాలు సమక్షంలో-

సూరి వుత్తరాన్ని ముగించేశాడు. నేను ఒకటి రెండుసార్లు వుత్త రాన్ని చదివాను.

శేఖరం హఠాత్తు మరణం గురించి ఆలోచిస్తున్న నా మనస్సుకు యీ సూరిగాడి వుత్తరానికి, శేఖరం మరణానికి, యేదో గట్టి సంబంధం వుందని తట్టింది.

వెంటనే నా కళ్ళల్లో శోభ లీలగా కనిపించింది.

(తెలుగుదేశం పత్రిక)